క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మణి

ఆమదాలవలస: చట్టాలపై ప్రతీ మహిళ అవగాహన పెంపొందించుకోవాలని ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి సూచించారు. జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయసాధికార సంస్థల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా న్యాయవిజ్ఞాన సదస్సుకు హాజరయ్యారు. గృహ హింస, బాల్య వివాహాలు, మహిళల హక్కులు, చట్టాలను వివరించారు. ఎటువంటి రుసుం లేకుండా ప్రభుత్వ న్యాయవాదులను పొందే అవకాశాలు, పేదలకు ప్రభుత్వ న్యాయం అందించే విధానాలను తెలియజేశారు. చైల్డ్ ప్రొటక్షన్ అధికారి కె.రమణ, శ్రీకాకుళం లోక్ అదాలత్ కోర్టు రిసోర్స్ పర్సన్లు వి.హరిప్రియ, సౌజన్య, ఐసీడీఎస్ పీఓ అనురాధ, మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో భూసారం



రైతులతో కలిసి పంటను పరిశీలిస్తున్న ఏఓ లతశ్రీ

ఎల్.ఎన్.పేట: సేంద్రియ సాగు పద్ధతులను అలవాటు చేసుకుని భూసారాన్ని పెంచుకోవచ్చని ఏఓ పైడి లతశ్రీ అన్నారు. రావిచంద్రి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో రైతులతో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందులను వినియోగించటం వల్ల భూసారం నశిస్తుందన్నారు. ప్రతీ ఏడాది పంట మార్పిడి, విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. సాగునీరు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే పెట్టుబడి తగ్గుతుందని వివరించారు. స్థానిక రైతులు, గ్రామ సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు పాల్గొన్నారు.

పరామర్శ..



సుధాకర్ పట్నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు

పాతపట్నం: మండల కేంద్రంలోని దుర్గమ్మ గుడి కాలనీకి చెందిన సుధాకర్ పట్నాయక్ ఇటీవల మృతి చెందాడు. మృతుడు సోదరుడు నిరంజన్ పట్నాయక్‌ను, కుటుంబ సభ్యులను పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ యరుకొల వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రదీప్, పార్టీ నాయకులు పనుకు మోహన్, టంకాల సుధాకర్, సత్యబిశ్వాల్ ఉన్నారు.

ఆధార్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆమదాలవలస: ఆధార్ శిబిరాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆమదాలవలస తపాలా కార్యాలయ హెడ్ పోస్ట్ మాస్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని తపాలా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నేషనల్ పోస్టల్ వారోత్సవాల సందర్భంగా గురువారం అంత్యోదయ దివస్‌గా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రధాన తపాలా కార్యాలయంలో ఆధార్ మెగా శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కొత్త ఆధార్ నమోదు, కార్డులోని పొరపాట్లు సరిదిద్దడం వంటి సేవలు అందజేస్తామన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: ఈ నెల 10వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి హిరమండలం తపాలా కార్యాయలంలో ఆధార్‌కు సంబంధించిన ప్రత్యేక సేవలను అందిస్తున్నామని ఆమదాలవలస సబ్ డివిజన్ తపాలా ఏఎస్పీ విక్రమ్ బుధవారం తెలిపారు. జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ఆమదాలవలస: సస్యరక్షణ చర్యలతో వరి పంటలో దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహన్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దజొన్నవలస, గాజులకొల్లివలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులకు పంటల యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, పంటల్లో వచ్చే చీడపీడలు, తెగుళ్లను ఏవిధంగా ఎదుర్కోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

లీకులమయం

- పదిచోట్ల పాడైన పైప్‌లైన్లు
- ఐదు చోట్ల లీకులను అరికట్టిన అధికారులు
- మళ్లీ ఖరీఫ్ సీజన్‌కే మిగిలినవి బాగు చేస్తామని చేతులెత్తేస్తున్న వైనం
- సాగునీరు అందక ఎండిపోతున్న వరి పంట



ఈసర్లపేట వద్ద పైప్‌లైన్ పాడవడంతో వృథాగా పోతున్న సాగునీరు

ఆమదాలవలస: బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ప్రధాన కుడి కాలువకు 30 కిలో మీటర్ల వద్ద అక్కులపేట ఎత్తిపోతల పథకాన్ని 2012 జూలైలో ప్రారంభించారు. ఆమదాలవలస, బూర్జ మండలాల్లోని 16 గ్రామాలకు చెందిన 4,311 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు దీనిని ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ప్రతి ఏటా ఈ పథకం నిర్వహణకు నిధులు మంజూరు చేస్తూ వచ్చారు. ఈ ఏడాది కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.6 లక్షల నిధులు మంజూరు చేసింది. పథకం ప్రారంభం వద్ద, ఈసర్లపేట నుంచి అక్కులపేట మధ్యలో సుమారు 10 చోట్ల పైపులైన్లు పాడయ్యాయి. లీకులు అరికట్టేందుకు ఈ ఏడాదికి రూ.2 లక్షలే ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ మొత్తం ఐదు ప్రధాన లీకులను అరికట్టేందుకు సరిపోయిందని వంశధార అధికారులు అంటున్నారు. మిగతా రూ.4 లక్షలు కాలువ నిర్వహణకు, పంపుల మరమ్మతులకు వెచ్చించినట్లు చెబుతున్నారు. ఈ పనులను కొంతమంది టీడీపీ కార్యకర్తలు తూతూ మంత్రంగా చేశారని, 20 ఆర్ పిల్లకాలువ నుంచి ఎత్తిపోతల పథకం ప్రారంభంలో ఉన్న గుర్రపు డెక్కను తొలగించకుండా నిధులు మాయం చేశారని అక్కులపేటకు చెందిన రైతులు ఆరోపిస్తున్నారు.

సాగునీరు అందని గ్రామాలు..

ఎగువ ప్రాంతాలైన సలికాం, చింతలపేట, బొబ్బిలిపేట, దండేవలస, అక్కులపేట తదితర గ్రామాలకు సాగునీరు అందడటం లేదు. వరి పంట పొట్టదశలో ఉన్నందున ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. పైపులైన్ల లీకులను బాగుచేసి ఎగువ ప్రాంతాలకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.



ఈసర్లపేట గ్రామ రహదారిపై నిత్యం పారుతున్న నీరు



20 ఆర్ కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

ఎగువ ప్రాంతాలకు నీరు అందించాలి



ఎగువ ప్రాంతంలో ఉన్న 16 గ్రామాకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందడంలేదు. ఏడు గ్రామాల్లోని వరి పంట పొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయి. పొట్ట దశలో పంట ఉంది. ఇటీవల చేపట్టిన లీకుల పనులను ఉన్నతాధికారులు పరిశీలించి రైతులకు న్యాయం చేయాలి.

– జి.ప్రభాకరరావు, రైతు, అక్కులపేట, ఆమదాలవలస మండలం

ప్రతిపాదనలు పంపిస్తాం..

ప్రస్తుతం రూ.6 లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. వాటిలో ఉన్నంత వరకు 5 చోట్ల లీకులు అరికట్టాం. ఈ ఏడాదికి మరి నిధులు ఏమీ లేవు. మళ్లీ ఖరీఫ్ సీజన్‌కు మాత్రమే ఉన్న పైపులైన్ లీకులు అరికట్టేందుకు ప్రతిపాదనలు పెడతాం. నిధులు మంజూరైతే పనులు చేస్తాం. పదిచోట్ల పైపులైన్ లీకైన మాట వాస్తవం. చిన్న లీకులు విడిచిపెట్టి పెద్ద లీకులను బాగుచేశాం.

– సునీల్‌కుమార్, వంశధార అక్కులపేట ఎత్తిపోతల పథకం ఏఈ, ఆమదాలవలస

ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

మెళియాపుట్టి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల నలుమూలల నుంచి 1,200 సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయని అధికారులు తెలిపారు. పెన్షన్లు ఇవ్వాలని, రహదారులు బాగుచేయాలని, గృహాలు మంజూరు చేయాలని అర్జీలు సమర్పించారు. 15 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నారు. తహసీల్దార్ పాపారావు, ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా, పలు శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, మాజీ ఎంపీపీ సలాన మోహన్‌రావు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు అనపాన రాజశేఖర్ రెడ్డి, నంబాళ్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పరిశీలన



ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణమూర్తి

కొత్తూరు: మండలంలోని కలిగాం గ్రామంలో ఈ-పంట నమోదును టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి బుధవారం పరిశీలించారు. పంట నమోదు వివరాలను ఆర్డీఓకు ఏఓ శ్రీనివాసరావు వివరించారు. నివగాం వద్ద వంశధార నదిలో ఏర్పాటు చేయనున్న ఇసుక ర్యాంపు స్థలాన్ని ఆర్డీఓ పరిశీలించారు. ర్యాంపు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలని మైన్స్, రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. నివగాంలో రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ధాన్యం సేకరణకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లతోపాటు పత్రాలను పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ చేయాలని తహసీల్దార్ రవిచంద్రతోపాటు ఇతర అధికారులకు ఆదేశించారు. సీఎస్‌డీటీ భీమారావు, సూపరింటెండెంట్ నసీర్, పారాపురం సర్వేయర్ అల్లు తిరుపతిరావు, వీఆర్వో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సోలార్ విద్యుత్‌పై అవగాహన

నరసన్నపేట: స్థానిక విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయం ఆవరణలో సోలార్ విద్యుత్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏఈ కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ సోలార్ రూఫ్‌టాప్ ఎనర్జీపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తామన్నారు. టెక్కలి ఈఈ శంకరరావు హాజరవుతారన్నారు. సాయంత్రం ఐదు గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు.

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–3 ఆర్ఆర్ కాలనీలో వినియోగదారులకు సోలార్ విద్యుత్ ఏర్పాటుపై గురువారం సాయంత్రం నాలుగు గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్థానిక ట్రాన్స్‌కో ఏఈ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ సోలార్ రూఫ్ టాప్ ఎనర్జీ పథకంలో భాగంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

చెత్త కనిపిస్తే చర్యలు



బుడితిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సారవకోట: రహదారికి ఇరువైపులా చెత్త కుప్పలు కనిపిస్తే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ మురళీ కృష్ణమోహన్ సూచించారు. బుధవారం మండలంలోని బుడితి, అవలింగి సచివాలయాలను సందర్శించారు. రికార్డులు, హాజరు, మూవ్‌మెంట్ రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ బుడితి, అవలింగి గ్రామాలకు సమీపంలో రోడ్డుకు ఇరువైపులా చెత్తకుప్పలు కన్పిస్తున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. అవలింగిలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళులు



కాన్షీరామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

కొత్తూరు: మండలంలోని ఎస్.ఎస్.కాలనీలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. కాన్షీరామ్ చిత్రపటానికి బీఎస్పీ పాతపట్నం ఇన్‌చార్జి డొడ్డేపల్లి కృష్ణారావు, ఎస్సీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు వడమ శ్రీనివాసరావు, దొర్నాన ఎండునాయుడు, దండు ప్రకాశరావు, పోలయ్య, శివకృష్ణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలను కాన్షీరామ్ సాకారం చేశారన్నారు. బీఎస్పీని దేశంలో మూడో అతి పెద్ద పార్టీగా నిలబెట్టారన్నారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన మహానేత కాన్షీరామ్ అని అన్నారు. పలువురు బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

సందడిగా బాణాల పండగ



బాణాలతో సందడి చేస్తున్న చిన్నారులు

సారవకోట: మండలంలోని అవలింగి జీబీటీ పాఠశాలలో బుధవారం సరస్వతీదేవి పూజ పురస్కరించుకుని బాణాల పండగను నిర్వహించారు. విద్యార్థులు అవలింగి, చీడిపూడి, బుడితి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఏదయా మీ దయ మా మీద లేదయా.. అనే పాట పాడారు. మన ఆచార, సంప్రదాయాలను విద్యార్థులకు వివరించినట్లు పాఠశాల డైరెక్టర్ మోహన్‌గాంధీ తెలిపారు.

టెట్‌కు 69 మంది గైర్హాజరు

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీలో బుధవారం నిర్వహించిన ఏపీ టెట్ – 2024 పరీక్షలకు 63 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ దాలినాయుడు తెలిపారు. ఫస్ట్ సెషన్‌లో 330 మందికి 292 మంది, రెండో సెషన్‌లో 330 మందికి 299 మంది హాజరయ్యారన్నారు.

నేడు మండల సమావేశం

ఎల్.ఎన్.పేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. మండల స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

మద్యం దుకాణాలకు 140 దరఖాస్తులు

నరసన్నపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 12 మద్యం దుకాణాలకు బుధవారం సాయంత్రానికి 140 దరఖాస్తులు వచ్చాయని సీఐ రమణమూర్తి, ఎస్ఐ గురుమూర్తి తెలిపారు. బుధవారం ఒక్కరోజే 70 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ

బాధ్యతల స్వీకరణ

కొత్తూరు: మండలం వెలుగు ఏపీఎంగా లలిత బుధవారం విధుల్లో చేరారు. ఈమె మెళియాపుట్టి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఏపీఎం జనార్దనరావు పాతపట్నం ఏపీఎంగా బదిలీపై వెళ్లారు. ఏపీఎం లలితకు ఎంఎంఎస్ సిబ్బంది అభినందించారు.

ఈఓగా హరికృష్ణ

హిరమండలం: స్థానిక పంచాయతీ కార్యనిర్వహణాధికారిగా తంప హరికృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం శివరాంపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన వై.శ్రీరామచంద్రమూర్తి రాజాం మండలం బొద్దాం పంచాయతీకి బదిలీపై వెళ్లారు. జూనియర్ అసిస్టెంట్‌గా డి.వరకార్తీక్, బిల్ కలెక్టర్‌గా ఎస్.రమణమ్మ బాధ్యతలు స్వీకరించారు. నెల 11 వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న స్నేహాంజలి

పొందూరు: మండలంలోని తాడివలస పంచాయతీ పరిధి లచ్చయ్యపేట గ్రామానికి చెందిన సనపల స్నేహాంజలి విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రదర్శించిన భరతనాట్యం ప్రదర్శన ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా జిల్లా నుంచి స్నేహాంజలి బుధవారం పాల్గొని నృత్య ప్రదర్శన చేసింది. స్నేహాంజలికి గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

సరస్వతీదేవిగా..



నరసన్నపేట: కార్ స్టాండ్ వద్ద సరస్వతీ పూజల్లో పాల్గొన్న విద్యార్థులు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారు బుధవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు తెల్లవారుజాము నుంచే దుర్గాదేవి మండపాలు, ఆలయాకు వెళ్లి సరస్వతీదేవికి పూజించారు. పలుచోట్ల అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కుంకుమ, ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: శ్రీముఖలింగంలో సరస్వతీదేవిగా పూజలు అందుకుంటున్న వారాహి అమ్మవారు



సారవకోట: పాతూరులో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహం



నరసన్నపేట: ఉర్లాం మార్కెట్ కూడలిలో సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గాదేవి



సారవకోట: అవలింగి నీలమణి అమ్మవారిని చామంతి పువ్వులతో అభిషేకం చేస్తున్న భక్తులు



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో సామూహిక అక్షరాభ్యాస పూజల్లో పాల్గొన్న చిన్నారులు



ఆమదాలవలస: పాలపోలమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాన్ని దర్శించుకుంటున్న భక్తులు



కొత్తూరు: గూనభద్ర ఆర్ఆర్ కాలనీ వనమహాలక్ష్మి ఆలయంలో సరస్వతీదేవి అవతారంలో దుర్గాదేవి



పాతపట్నం: కాగువాడ ఆలయంలో సరస్వతీదేవి పూజల్లో పాల్గొన్న మహిళలు, విద్యార్థులు



ఎల్.ఎన్.పేట: కోవిలాం కాలనీ సమీపంలో ముగ్గురమ్మల ఆలయంలో సరస్వతీదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పాతపట్నం: సరస్వతీదేవిగా నీలమణిదుర్గ అమ్మవారు

14 నుంచి పల్లె పండగ

సరుబుజ్జిలి: గ్రామసభల ద్వారా గుర్తించిన ఉపాధి హామీ పనుల శంకుస్థాపనకు సంబంధించి ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు పల్లెపండగ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.పావని బుధవారం వెల్లడించారు. 14వ తేదీ ఉదయం 10గంటలకు షళంత్రి, డకరవలస, పెదవెంకటాపురంలసీసీ రోడ్లు, కాలువలకు శంకుస్థాపనలు జరుగుతాయని వెల్లడించారు.